

డెంగీ నిర్మూలనపై ప్రతిజ్ఞ చేస్తున్న వైద్య ఆరోగ్య పర్యవేక్షకులు, సిబ్బంది

ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

- యూపీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ దీప్తి

నల్లకుంట, మే 16 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరు తమ ఇంటితోపాటు పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకున్నప్పుడే రోగాలు దరిచేరవని ప్రభుత్వ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (యుపీహెచ్‌సీ) తిలక్‌నగర్ వైద్యాధికారి డాక్టర్ దీప్తి అన్నారు. ముఖ్యంగా ఇళ్లల్లో నీరు నిల్వకుండా జాగ్రత్తలు తీసుకున్నప్పుడే ఈగలు, దోమలు వృద్ధి చెందవని, ఇది ప్రతి ఒక్కరి బాధ్యత అని ఆమె సూచించారు. జాతీయ డెంగీ నిర్మూలన దినోత్సవం సందర్భంగా గురువారం నల్లకుంట డివిజన్‌లోని తిలక్‌నగర్ యూపీహెచ్‌సీ ఆధ్వర్యంలో పరిసర ప్రాంతాలలో ప్రజలకు డెంగీపై అవగాహన కల్పించారు. పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు కరపత్రాలను పంపిణీ చేశారు. అనంతరం యూపీహెచ్‌సీ ప్రాంగణంలో సిబ్బంది, ప్రజలతో ఆపరేషన్-డెంగీపై ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో హైదరాబాద్ జిల్లా మలేరియా అధికారి నిరంజన్, జీహెచ్‌ఎంసీ సర్కిల్ 16 ఎస్ఈ దుర్గాప్రసాద్, ఆరోగ్య పర్యవేక్షకులు శ్రీనివాసులు, ప్రవీణ్‌కుమార్, ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ముషీరాబాద్, మే 16 (ఆంధ్రజ్యోతి): డెంగీ వ్యాధి నివారణకు జాగ్రత్తలు తీసుకోవాలని ముషీరాబాద్ యూపీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ దీప్తి ప్రియాంకా అన్నారు. గురువారం జాతీయ డెంగీ నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని జీహెచ్‌ఎంసీ, ఎంటమాలజీ సూపర్‌వైజర్ యాదగిరి ఆధ్వర్యంలో డెంగీ వ్యాధిపై ప్రజలలో అవగాహన కల్పించేందుకు ముషీరాబాద్‌లో ర్యాలీ నిర్వహించారు.

వకాలత్‌పై సుప్రీంకోర్టు తీర్పు హర్షణీయం

- తెలంగాణ న్యాయవాదుల జేఏసీ కన్వీనర్ గోవర్ధన్‌రెడ్డి

కవాడిగూడ, మే 16 (ఆంధ్రజ్యోతి): వకాలత్ ఇక వినియోగ సేవ కాదని, న్యాయవాద వృత్తి వినియోగ దారుల చట్టం పరిధిలోకి రాదని సుప్రీంకోర్టు తీర్పు చెప్పడం హర్షణీయమని తెలంగాణ న్యాయవాదుల జేఏసీ కన్వీనర్ పులిగారి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. గురువారం కవాడిగూడలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ క్లయింట్-లాయర్ సేవ ఒక ఒప్పందం లాంటిదని, అది వ్యక్తిగత సేవ మాత్రమేనని అన్నారు. అందువల్ల న్యాయవాదులు అందించే సేవలకు వినియోగదారుల పరిరక్షణ చట్టం వర్తించదని అందువల్ల ఈ వృత్తి సేవ వినియోగ సేవల పరిధిలోకి రాదంటూ సుప్రీంకోర్టు తేల్చిచెప్పడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. వైద్య సేవలు కూడా ఈ చట్టం పరిధి నుంచి తొలగించాలనే పిటిషన్ ఒకటి సుప్రీంకోర్టు విచారణలో ఉందని ఆయన పేర్కొన్నారు.

ఫ్యాషన్ డిజైనింగ్ కోర్సులకు ఉచిత స్కాలర్‌షిప్ టెస్ట్

బర్కత్‌పుర, మే 16 (ఆంధ్రజ్యోతి): నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫ్యాషన్ డిజైనింగ్ (నిఫ్) ఆధ్వర్యంలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు ఉన్న ఫ్యాషన్ డిజైనింగ్‌లో డిప్లొమా కోర్సులలో దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఆ సంస్థ డైరెక్టర్ కన్నెబోయిన రాముయాదవ్ తెలిపారు. ఫ్యాషన్ డిజైనింగ్ కోర్సులలో చేరేందుకు ఈ నెల 19న ఆదివారం కొత్తపేటలోని నిఫ్ సంస్థలో ఉచిత స్కాలర్‌షిప్ టెస్ట్‌లు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. గురువారం బర్కత్‌పురలోని సంస్థ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆసక్తి గల మహిళలు, యువతులు, విద్యార్థినీలు ఈ నెల 18వ తేదీలోపు ఉచిత స్కాలర్ షిప్ టెస్ట్‌కు దరఖాస్తు చేసుకోవాలని ఆయన కోరారు. వివరాలకు 9030610033, 9030610055 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని ఆయన కోరారు.



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న డాక్టర్ హిప్నో పద్మాకమలాకర్

భిన్నత్వంలో ఏకత్వమే కుటుంబం

- డాక్టర్ హిప్నో పద్మాకమలాకర్

కవాడిగూడ, మే 16 (ఆంధ్రజ్యోతి): భిన్నత్వంలో ఏకత్వమే కుటుంబమని ప్రోగ్రెసివ్ సైకాలజిస్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షురాలు డాక్టర్ హిప్నో పద్మాకమలాకర్, కృష్ణవేణి అన్నారు. అంతార్జాతీయ కుటుంబాల దినోత్సవం సందర్భంగా లోయర్ ట్యాంక్‌బండ్‌లోని రామకృష్ణమఠంలో యోగానంద రఘుమాహారాజు, నవభారత లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో బాలల సేవా విభాగంలో కుటుంబాలు- వాతావరణ మార్పులు అనే అంశంపై డ్రాయింగ్, వ్యాసరచన పోటీలు, ఫ్యాన్సీ డ్రెస్ పోటీలు నిర్వహించారు. పోటీలలో గెలుపొందిన వారికి గురువారం బహుమతులను, రంగు పెన్సిల్స్, ఫ్రీడంఫైటర్స్, దేశ భక్తి గీతాలు, పుస్తకాలు అందజేసినట్లు హిప్నో పద్మాకమలాకర్, కృష్ణవేణిలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అన్ని బంధాలను సమన్వయం చేసుకొని అందరితో కలివిడిగా ఉంటూ గౌరవ మర్యాదలు ఇచ్చి పుచ్చుకోవాలని అన్నారు. ఎక్కడ తగ్గాలో తెలుసుకుంటే బంధాలు కలకాలం నిలుస్తాయని అన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.



నారాయణగూడ డివిజన్ జలమండలి జీఎం కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న నాగమయ్యకుంట బస్తీ అధ్యక్షుడు సాయిలు, బస్తీ మహిళలు

కలుషితనీరు, డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని జీఎం కార్యాలయం ఎదుట బస్తీవాసుల ధర్నా

రాంనగర్, మే 16 (ఆంధ్రజ్యోతి): అడిక్‌మెట్ డివిజన్‌లోని నాగమయ్యకుంట బస్తీలో కొంత కాలంగా మంచినీరు, కలుషితనీరు, డ్రైనేజీ సమస్యలకు శాశ్వత పరిష్కారం చేయాలని బస్తీ అధ్యక్షుడు సాయిలు గురువారం బస్తీవాసులు, మహిళలతో కలిసి నారాయణగూడ డివిజన్ జలమండలి జీఎం కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సాయిలు మాట్లాడుతూ నాగమయ్యకుంటలో మంచినీటి సమస్య శాశ్వత పరిష్కారానికి పైప్‌లైన్ వ్యవస్థను ఏర్పాటు చేసి ఇంటింటికి సరిపడ తాగునీరు అందించాలని జలమండలి అధికారులు, ప్రజాప్రతినిధులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. పురాతన పైప్‌లైన్ వ్యవస్థ వల్ల నల్లాల్లో కలుషితనీరు సరఫరా అవుతుందని దీంతో బస్తీవాసులు అనారోగ్యానికి గురవుతున్నారని వాపోయారు. ధర్నా అనంతరం తమ డిమాండ్ల పత్రాన్ని జలమండలి మేనేజర్ రామకృష్ణకు అందజేశారు. కార్యక్రమంలో బస్తీవాసులు జహంగీర్‌బాబా, సుధాకర్, రాజు, యాదగిరి, మంగమ్మ, అరుణ, అలివేలు తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణంపై చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలు

రాంనగర్, మే 16 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణపై పాఠశాల స్థాయి విద్యార్థులకు చిత్రలేఖనం, వ్యాసరచనపై ఆన్‌లైన్ పోటీలు నిర్వహిస్తున్నామని ఎన్విరాన్‌మెంట్ ప్రొటెక్షన్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ రంగయ్య తెలిపారు. ఈ భూమిని-ప్రకృతిని ఎలా కాపాడుకుందామని అనే అంశంపై ఆన్‌లైన్ పోటీలు జరుగుతున్నాయని తెలిపారు. విద్యార్థులు ఇంటి వద్ద కుటుంబ సభ్యుల సహకారం తీసుకోవచ్చని తెలిపారు. పూర్తి చేసిన బొమ్మ లేదా వ్యాసాన్ని ఆన్‌లైన్‌లో పంపించాలని, ప్రథమ, ద్వితీయ, తృతీయ విజేతలకు 10 వేలు, 6 వేలు, 3 వేలు బహుమతులుగా మరో 10 మందికి వెయ్యి చొప్పున కంసోలేషన్ బహుమతి, గ్రీన్-2 అవార్డు అందజేయనున్నట్లు ఆయన తెలిపారు. ఈ పోటీలో పాల్గొన్న ప్రతి విద్యార్థికి సంస్థ నుంచి సర్టిఫికెట్ అందిస్తామన్నారు. ఇతర వివరాలకు 8179019623 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని ఆయన కోరారు.





ఇందిరాపార్కు, చౌరస్తా, దోమలగూడలో కురిసిన భారీ వర్షానికి జలమయమైన రోడ్లు ఇబ్బందులు పడుతున్న వాహనదారులు



బర్కత్‌పుర చమాన్ ఐసీఐసీఐ బ్యాంకు వద్ద కూలిన భారీ వృక్షం

దంచికొట్టిన వర్షం

- రోడ్లపై వరదనీరు..వాహనదారుల ఇబ్బంది
- లోతట్టు ప్రాంతాలు జలమయం
- ఇళ్లలోకి నీరు, తడిసిన నిత్యావసరాలు

రాంనగర్, మే 16 (ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్, అంబర్‌పేట నియోజకవర్గాలలో గురువారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. దీంతో లోతట్టు బస్తీలు, ఇళ్లలోకి వర్షం నీరు వచ్చి ప్రజలు ఇబ్బందులు పడ్డారు. పలు ప్రధాన రహదారులు, ప్రధాన కూడళ్లల్లో వర్షం నీరు నిలిచి రోడ్లు చెరువులను తలపించాయి. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పలుచోట్ల వర్షం వల్ల డ్రైనేజీలు పొంగిపొర్లాయి. రాంనగర్ శ్రీఈదమ్మ ఆలయం వీధి, గణేష్‌నగర్‌లోని వరదనీరుతో రాకపోకలు నిలిచిపోయాయి. పలు ఇళ్లలోకి వర్షం నీరు రావడంతో ఇంట్లోని వస్తువులు తడిసిముద్దయ్యాయి. నాగమయ్యకుంట బస్తీలోని ఇళ్లలోకి వర్షం నీరు చేరింది. ఇంట్లోకి వచ్చిన నీరును బకెట్లు, చీపుర్ల ద్వారా బయటకు వేశారు. వీఎస్టీ చౌరస్తాలో భారీగా వర్షం నీరు నిలిచి చిన్నపాటి చెరువును తలపించింది. వీఎస్టీ నుంచి రాంనగర్ వెళ్లే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వర్షం వల్ల ఆర్టీసీ క్రాస్‌రోడ్స్‌లోని మెట్రోస్టేషన్ కింద వర్షం నీరు నిలిచిపోవడంతో పాటు డ్రైనేజీ పొంగిపొర్లింది. లోతట్టు ప్రాంతాలైన పద్మాకాలనీ, అంజయ్యనగర్‌లలో వర్షం నీరు చేరడంతో ప్రజలు ఇబ్బందులుపడ్డారు.

చిక్కడపల్లి, మే 16 (ఆంధ్రజ్యోతి): చిక్కడపల్లి భారీ వర్షం కురిసింది. వివేక్‌నగర్‌లో గాలి దుమారం, వర్షానికి ఓ చెట్టు పడిపోవడంతో చుట్టుప్రక్కల ప్రాంతాల్లో రెండు గంటలపాటు కరెంట్ సరఫరా నిలిచిపోయింది. వివేక్‌నగర్‌లోని పలు ఇళ్లలోకి వర్షపు వరదనీరు చేరింది. దాదాపు గంటకుపైగా కురిసిన వర్షంతో రోడ్లు జలమయమయ్యాయి. ముషీరాబాద్ నుంచి వచ్చిన వరదనీరు బాపునగర్ కాలువలోకి చేరడంతో రోడ్లపై మోకాలిలోతు నీరు నిలిచిపోయింది.

కవాడిగూడలో భారీ వర్షం

కవాడిగూడ , మే 16 (ఆంధ్రజ్యోతి): కవాడిగూడ డివిజన్‌లోని పలుప్రాంతాల్లో గురువారం సాయంత్రం కురిసిన భారీ వర్షం వల్ల వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఇందిరాపార్కు ,గాంధీనగర్ లింక్‌బ్రిడ్జి, కోదండరెడ్డినగర్, లోయర్ ట్యాంక్ బండ్ తదితర ప్రాంతాల్లో మోకాళ్లలోతు వర్షపు నీరు రోడ్లపై ప్రవహించడంతో వాహనదారులు,పాదచారులు ఇబ్బందులు పడ్డారు. జీహెచ్‌ఎంసీ, డీఆర్‌ఎఫ్ టీమ్ రంగంలోకి దిగి నిలిచిపోయిన వరదనీటిని క్లియర్ చేయడంతో వాహనదారులు. పాదాచారులు ఊరిపి పీల్చుకున్నారు.

రోడ్డుపై కూలిన చెట్టు, తప్పిన ప్రమాదం

బర్కత్‌పుర/నల్లకుంట/అంబర్‌పేట, మే 16 (ఆంధ్రజ్యోతి): నగరంలో కురిసిన భారీ వర్షానికి అంబర్‌పేట నియోజకవర్గం పరిధిలోని అయిదు మున్సిపల్ డివిజన్లలో రోడ్లన్ని జలమయంగా మారాయి. కాలనీలు, బస్తీలలో వర్షం నీరు వరదలై పారింది. దీంతో జనజీవనం స్తంభించిపోయింది. నియోజకవర్గం పరిధిలోని జిందాతిలిస్మాత్ రోడ్, అంబర్‌పేట పోలీస్ స్టేషన్ ఎదురుగా, చేనెంబర్ చౌరస్తా, సీగలోకేఫ్ చౌరస్తా, తిలక్‌నగర్ రైల్వే బ్రిడ్జి, నింబోలిఅడ్డ రైల్వే బ్రిడ్జి, కబేళా చౌరస్తా, గోల్నాక చౌరస్తా, టూరిస్ట్ హోటల్ చౌరస్తా, బర్కత్‌పుర చౌరస్తా, పటేల్‌నగర్ చౌరస్తా, విద్యానగర్ రైల్వే బ్రిడ్జి, గోల్నాక కూరగాయల మార్కెట్ తదితర ప్రాంతాలలో రోడ్లపై వర్షం నీరు నిలిచిపోవడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది.

ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురియడంతో చెట్టు కూలిపోయింది. కాచిగూడ డివిజన్‌లోని బర్కత్‌పుర చమాన్ ఐసీఐసీఐ బ్యాంకు వద్ద చెట్టు రోడ్లపై కూలిపోవడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఎలాంటి ఆస్తి, ప్రాణ నష్టం జరగకపోవడంతో ప్రజలు, వాహనదారులు ఊపిరిపీల్చుకున్నారు. రోడ్డుపై పడ్డ చెట్టు కొమ్మలను జీహెచ్‌ఎంసీ సిబ్బంది యుద్ధ ప్రాతిపదికన తొలగించారు. బీజేపీ సెంట్రల్ జిల్లా ఉపాధ్యక్షుడు కన్నె రమేష్‌యాదవ్, కార్పొరేటర్ కన్నె ఉమాదేవిలు సంఘటన స్థలానికి వెళ్లి చెట్ల కొమ్మల తొలగింపును పర్యవేక్షించారు. కాశీరామ్‌జీరా వద్ద వర్షం నీరు సాఫీగా వెళ్లక కొన్ని ఇళ్లలోకి రావడంతో స్థానిక ప్రజలు ఇబ్బందులు పడ్డారు.



అంబర్‌పేట ప్రేమ్‌నగర్ బస్తీలో పొటెత్తిన వరదనీరు



బర్కత్‌పుర ఇండియన్ బ్యాంకు వద్ద వర్షానికి నేలకూలిన భారీ వృక్షం



ఆర్టీసీ క్రాస్‌రోడ్‌లోని కార్మిక శాఖ కమిషనరేట్ వద్ద కూలిన చెట్టు



భారీ వర్షంతో చెరువుగా మారిన వీఎస్టీ చౌరస్తా



ఆర్టీసీ క్రాస్‌రోడ్స్‌లో వర్షం నీటిలో డ్రైనేజీ మ్యాన్‌హోల్



నాగమయ్యకుంటలోకి వచ్చిన వర్షం నీరు



ఆర్టీసీ క్రాస్‌రోడ్స్ వద్ద...

బాయ్స్ స్పోర్ట్స్ కంపెనీలో అడ్మిషన్లు

- జూన్ 10 నుంచి 15 వరకు ర్యాలీ

అల్వాల్, మే 16 (ఆంధ్రజ్యోతి): బాయ్స్ స్పోర్ట్స్ కంపెనీ(బీఎస్‌సీ) మద్రాస్ రెజిమెంటల్ సెంటర్ స్పోర్ట్స్ అథ్లెటిక్స్ కేడెట్స్‌ను చేర్చుకునేందుకు జూన్ 10 నుంచి 15వ తేదీ వరకు మద్రాస్ రెజిమెంటల్ సెంటర్ వెల్లింగ్‌టన్ (నీలగిరి)లో ర్యాలీ నిర్వహిస్తున్నట్లు రక్షణశాఖ పౌరసంబంధాల అధికారి శివహరినాయక్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. బీఎస్‌సీ అనేది స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా, ఇండియన్ ఆర్మీ మధ్య జాయింట్ వెంచర్. భవిష్యత్‌లో నిర్వహించే అంతర్జాతీయ క్రీడా పోటీల్లో పతకాలను గెలుచుకోవడానికి ర్యాలీలో ఎంపిక చేసిన కేడెట్స్‌ను తీర్చిదిద్దుతారు. క్రీడా విభాగంలో సెలక్షన్ ట్రయల్స్ ఫిజికల్ అండ్ టెక్నికల్ స్కిల్స్ టెస్ట్‌లను స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా కోచ్‌లు, బోర్డ్ ఆఫ్ ఆఫీసర్స్ ఆధ్వర్యంలో నిర్వహిస్తారు. దరఖాస్తుదారుడి వయస్సు 8 నుంచి 14 సంవత్సరాల మధ్య ఉండాలి. (2010 జూన్ 9 నుంచి 2016 జూన్ 10) లోపు జన్మించిన వారై ఉండాలి. కనీసం 2వ తరగతి ఉత్తీర్ణులై ఉండాలి. ఎంపిక సమయంలో మెడికల్ ఆఫీసర్, స్పోర్ట్స్ మెడిసిన్ సెంటర్ ద్వారా మెడికల్ ఫిట్‌నెస్‌ను నిర్ధారిస్తారు. శరీరంలో ఏ భాగంలోనైనా శాశ్వత టాటూ ఉన్న అభ్యర్థులు ర్యాలీలో పాల్గొనడానికి అనర్హులు. అర్హత గల అభ్యర్థులు ది బ్లాక్ బ్రిడ్జ్, ది మద్రాస్ రెజిమెంటల్ సెంటర్, వెల్లింగ్‌టన్(నీలగిరి)లో 2024 జూన్ 10న ఉదయం 7 నుంచి 12 గంటల వరకు రిపోర్ట్ చేయవచ్చు. మరిన్ని వివరాల కోసం 8848545629, 9790808233లో సంప్రదించవచ్చు.

ఇద్దరు సెల్‌ఫోన్ స్నాచర్ల అరెస్ట్

- 10 గంటల్లోనే కేసును ఛేదించిన తుకారాంగేట్ పోలీసులు



విగ్నేష్ క్రాంతి

అడ్డగుట్ట, మే 16 (ఆంధ్రజ్యోతి): సెల్‌ఫోన్ స్నాచింగ్‌కు పాల్పడిన ఇద్దరు నిందితులను తుకారాంగేట్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. మరో బాలుడిని జువెనైల్ హోంకు తరలించారు. సర్కిల్ ఇన్‌స్పెక్టర్ అంబటి అంజనేయులు తెలిపిన వివరాల ప్రకారం.. సికింద్రాబాద్ మారేడుపల్లి సెయింట్ జాన్స్ చర్చి సమీపంలో గురువారం ఉదయం ఓ వ్యక్తి బస్సు కోసం నిలబడి ఉండగా అతడి సెల్‌ఫోన్‌ను నంబరు ప్లేట్‌లేని యాక్టీవా బైకుపై వచ్చిన ముగ్గురు దుండగలు అపహరించుకుపోయారు. వెంటనే బాధితుడు తుకారాంగేట్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు సీసీ ఫుటేజీ ఆధారంగా నిందితులుగా అడ్డగుట్ట శాస్త్రినగర్‌కు చెందిన నక్కల విగ్నేష్(21), క్రాంతి(21) మరో బాలుడు(17)ని గుర్తించి వారిని అదుపులోకి తీసుకున్నారు. విచారణలో సెల్‌ఫోన్‌ను తామే అపహరించినట్లు వారు అంగీకరించారు. నిందితుల ఇద్దరిని అరెస్టు చేసి జైలుకు తరలించగా బాలుడిని జువెనైల్ హోంకు తరలించామని సీఐ తెలిపారు. 10 గంటల వ్యవధిలో కేసును ఛేదించిన తుకారాంగేట్ క్రైమ్ కానిస్టేబుళ్లు రాకేశ్, నరేష్, సాయికుమార్, అశోక్‌ను సీఐ అభినందించారు.

కారును ఢీకొట్టిన ట్రావెల్స్ బస్సు



బేగంపేట ఫ్లైఓవర్‌పై ప్రమాదానికి గురయిన కారు

బేగంపేట, మే 16(ఆంధ్రజ్యోతి): బేగంపేట ఫ్లైఓవర్ బ్రిడ్జిపై ఓ కారు ప్రమాదానికి గురై రోడ్డుకు అడ్డంగా తిరగడంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. బేగంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన సంఘటన వివరాలను ఇన్‌స్పెక్టర్ రామయ్య వెల్లడించారు. గురువారం ఉదయం 8గంటల సమయంలో అమీర్‌పేట నుంచి బేగంపేట వెళ్తున్న కారును వెనుక నుంచి వస్తున్న ఓ ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ఢీ కొట్టడంతో కారు రోడ్డుకు అడ్డంగా తిరిగింది. దీంతో కారు ముందుభాగం స్వల్పంగా ధ్వంసమైంది. కారు రోడ్డుకు అడ్డంగా తిరగడంతో ట్రాఫిక్ సమస్య ఏర్పడింది. సమస్యను గుర్తించిన వాహనదారులు 100 నంబరుకు డయల్ చేశారు. సమాచారం అందుకున్న ట్రాఫిక్ పోలీసులు అక్కడికి చేరుకొని ప్రమాదానికి గురైన కారును క్రేన్ ద్వారా తొలగించి, ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. కారులో ప్రయాణిస్తున్న వారికి ఎటువంటి గాయాలు కాలేదు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

22న టీఎస్ పీసీబీ ఆధ్వర్యంలో చిత్రలేఖనం పోటీలు

హైదరాబాద్ సిటీ, మే 16 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ జీవవైవిధ్య దినోత్సవాన్ని పురస్కరించుకొని తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో ఈ నెల 22న ఉదయం 10 గంటలకు చిత్రలేఖనం పోటీలు నిర్వహిస్తున్నట్లు పర్యావరణ, సామాజిక శాస్త్రవేత్త ప్రసన్నకుమార్ తెలిపారు. జూనియర్, సబ్ జూనియర్, సీనియర్ విభాగాల్లో సనత్‌నగర్‌లోని టీఎస్ పీసీబీ కార్యాలయంలో పోటీలు నిర్వహిస్తామని ఆయన పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న పాఠశాలల విద్యార్థులు నేరుగా తెలంగాణ రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి కార్యాలయంలో పేరు నమోదు చేసుకోవాలని ఆయన సూచించారు.

ఆర్టీసీ క్రాస్‌రోడ్‌లో సినిమా థియేటర్లు ఓపెన్

చిక్కడపల్లి, మే 16 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ క్రాస్‌రోడ్‌లో సినిమా థియేటర్లు తెరిచే ఉంటాయని, ఏదో ఒక సినిమా నడిపిస్తామని తెలంగాణ ఫిలిం ఎగ్జిబిటర్ల సంఘం సభ్యుడు బాల్‌గోవింద్‌రాజ్ తెలిపారు. సినిమాలు రాకపోవడం వల్ల సింగిల్ స్క్రీన్ థియేటర్లు కొన్ని రోజులు మూతపడే ప్రమాదం ఉందని ఆయన పేర్కొన్నారు. కొత్త సినిమాలు వస్తే మళ్లీ తెరుస్తారని తెలిపారు.

ఉరి వేసుకొని యువకుడి ఆత్మహత్య

కుషాయిగూడ, మే 16 (ఆంధ్రజ్యోతి): మానసిక ఆందోళనతో ఓ యువకుడు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన చర్లపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పెద్ద చర్లపల్లికి చెందిన లక్ష్మీనారాయణ కుమారుడు జి.వెంకట రమణ (20) గత యేడాది ఇంటర్‌లో ఫెయిల్ కావడంతో ఇంట్లోనే ఉంటున్నాడు. గురువారం సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో తన గదిలో చీరతో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన కుటుంబసభ్యులు అతడిని వెంటనే స్థానిక ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు చర్లపల్లి పోలీసులు కేసు నమోదు చేసుకొని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని గాంధీ ఆసుపత్రికి తరలించారు.

భర్తను చంపి గుండెపోటుగా చిత్రీకరించిన భార్య

- నలుగురు నిందితులకు రిమాండ్

యూసుఫ్‌గూడ, మే 16 (ఆంధ్రజ్యోతి): భర్తను చంపి గుండెపోటుగా చిత్రీకరించిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఎల్లారెడ్డిగూడలో శ్రీలక్ష్మి, విజయ్‌కుమార్ దంపతులు నివసిస్తున్నారు. శ్రీలక్ష్మి మరో వ్యక్తితో చనువుగా ఉండడం గమనించిన విజయ్‌కుమార్ ఆమెను మందలించాడు. ఈ విషయంలో భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో ఫిబ్రవరి 1వ తేదీన శ్రీలక్ష్మి తనకు తెలిసిన పటోళ్ల రాజేశ్వర్‌రెడ్డి, రాజేష్, బాబన్ అలియాస్ మహమద్ మైతాబ్‌లతో కలిసి పథకం ప్రకారం విజయ్‌కుమార్‌పై దాడి చేశారు. అతడిని తీవ్రగా కొట్టడంతో మృతి చెందాడు. అనంతరం మృతదేహాన్ని బాత్‌రూమ్‌లో పడేశారు. చుట్టుపక్కల వారు, బంధువులకు తన భర్త గుండెపోటుతో మృతి చెందాడని నమ్మించి దహన సంస్కారాలు కూడా పూర్తి చేసింది. అప్పటి నుంచి రాజేశ్వర్‌రెడ్డికి నిద్ర పట్టడం లేదు. పోలీసులకు చెబితే కొడతారని భయపడి వికారాబాద్ పారిపోయాడు. తిరిగి నగరానికి వచ్చి ఖైరతాబాద్ తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లి జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న అనిల్‌కుమార్‌కు శ్రీలక్ష్మి మరో ముగ్గురం కలిసి విజయ్‌కుమార్‌ను హత్య చేశామని చెప్పాడు. అతడి స్టేట్‌మెంట్ తీసుకున్న అనిల్‌కుమార్ మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు నలుగురు నిందితులను అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు.

యోగాసనంలో రికార్డు సాధించిన విద్యార్థికి అభినందనలు

జీడిమెట్ల, మే 16 (ఆంధ్రజ్యోతి): యోగాసనంలో ప్రపంచ రికార్డు సాధించిన సూరారంకాలనీకి చెందిన భగేష్ అనే విద్యార్థిని మాజీ కార్పొరేటర్ జి.సురేష్‌రెడ్డి అభినందించారు. ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డులో వరల్డ్ రికార్డు ఆఫ్ ఎక్సలెన్సీ సర్టిఫికెట్ పొందాడు. రెండు నిమిషాల యాభై సెకండ్లు యోగాసనం చేసినందుకు ఈ సర్టిఫికెట్ సాధించాడు.

రోడ్డుపై మద్యం తాగొద్దన్నందుకు వ్యక్తిపై దాడి

బర్కత్‌పుర, మే 16 (ఆంధ్రజ్యోతి): రోడ్డుపై మద్యం తాగొద్దన్నందుకు నలుగురు వ్యక్తులు ఓ ప్రైవేట్ ఉద్యోగిపై దాడికి పాల్పడ్డారు. ఈ సంఘటన కాచిగూడ పీఎస్ పరిధిలో జరిగింది. ఎస్ఐ నరేష్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం... నెహ్రూనగర్‌లో నివాసముంటున్న ఏ. శ్రీకాంత్‌గౌడ్(33) ప్రైవేట్ ఉద్యోగి. బుధవారం రాత్రి నెహ్రూనగర్ వెస్ట్రన్ బేకరీ నుంచి ఇంటికి వెళ్తుండగా రోడ్డుపై నలుగురు వ్యక్తులు కూర్చొని మద్యం తాగుతున్నారు. రోడ్డుపై కూర్చుని ఎందుకు మద్యం తాగుతున్నారంటూ శ్రీకాంత్‌గౌడ్ వారిని మందలించడంతో కోపంతో నలుగురు దాడికి పాల్పడ్డారు. శ్రీకాంత్‌గౌడ్‌పై జరిగిన దాడిలో ఆయన కంటి వద్ద తీవ్ర గాయమైంది. దాడికి పాల్పడిన బాలాజీ, మాధవ్, కార్తీక్, నిఖిలేష్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నరేష్‌కుమార్ తెలిపారు. శ్రీకాంత్‌గౌడ్‌ను చికిత్స కోసం ఆస్పత్రికి తరలించామని ఆయన తెలిపారు.

రైలు నుంచి జారిపడి మేస్త్రీ మృతి

బర్కత్‌పుర, మే 16(ఆంధ్రజ్యోతి): రైలు బోగిలో డోర్‌వద్ద నిల్చున్న ఓ మేస్త్రి ప్రమాదవశాత్తు జారీపడి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ సంఘటన కాచిగూడ రైల్వే పీఎస్ పరిధిలో జరిగింది. సీఐ ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం... జీడిమెట్లలో నివాసం ఉంటున్న ఎ. రమేష్(45) మేస్త్రి. గురువారం షాద్‌నగర్ నుంచి కాచిగూడ రైల్వే స్టేషన్‌కు హంద్రీనివా ఎక్స్‌ప్రెస్ రైలులో వస్తున్నాడు. బుద్వేల్-ఉందానగర్ రైల్వే స్టేషన్ల నడుమ రైలు బోగీలో డోర్ వద్ద ఉన్న రమేష్ ప్రమాదవశాత్తు కిందపడిపోయాడు. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు.

కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య

కవాడిగూడ, మే 16 (ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాలతో ఓ హామాలీ వర్కర్ ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన గాంధీనగ్ పీఎస్ పరిధిలోని బన్సీలాల్‌పేట సీసీ నగర్‌లో గురువారం ఉదయం జరిగింది, గాంధీనగర్ సీఐడీ రాజు తెలిపిన వివరాల ప్రకారం.. బన్సిలాల్‌పేట సీసీనగర్‌లో నివాసం ఉండే డి చంద్రశేఖర్(21) హామాలీ వర్కర్‌గా పనిచేస్తున్నాడు. వివాహం కాలేదు. కుటుంబంలో అన్నదమ్ముల మధ్య జరుగుతున్న కలహాల కారణంగా జీవితంపై విరక్తి చెందిన చంద్రశేఖర్ సమీపంలో ఉన్న పెద్దమ్మ ఇంటికి వెళ్లి బుధవారం రాత్రి ఫ్యాన్‌కు తాడుతో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఉదయం చూసిన కుటుంబ సభ్యులు వెంటనే గాంధీనగర్ పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి పోలీసులు చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురికి తరలించారు. చంద్రశేఖర్ అక్క రేఖ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కుటుంబ కలహాల వల్ల చంద్రశేఖర్ ఉరివేసుకొని ఆత్మహ్యత్య చేసుకున్నాడని కేసు నమోదు చేసినట్లు గాంధీనగర్ పోలీసులు తెలిపారు.





నుజ్జునుజ్జయిన కారు ముందుభాగం, ముక్కలైన బైక్

కారు ఢీకొని ద్విచక్ర వాహనదారుడి మృతి

కవాడిగుడ, మే 16 (ఆంధ్రజ్యోతి): ట్యాంక్‌బండ్‌పై వేగంగా వెళ్తున్న ఓ కారు.. పల్సర్ బైక్‌ను ఢీకొట్టడంతో బైక్‌పై వెళ్తున్న యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. దోమలగూడ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నాగర్ కర్నూల్ జిల్లా కొల్లాపూర్‌కు చెందిన ఎం.కార్తీక్ (21) అనే యువకుడు కర్మన్‌ఘాట్‌లో నివాసం ఉంటూ కారు డ్రైవర్ పనిచేస్తున్నాడు. గురువారం రాత్రి కార్తీక్ తన పల్సర్ బైక్‌పై యూసుఫ్‌గూడ నుంచి అంబర్ పేటకు వెళ్తున్న క్రమంలో ట్యాంక్ బండ్ పైకి రాగానే దారి తప్పి, సికింద్రాబాద్ వైపు వెళ్తుండగా.. సికింద్రాబాద్ వైపు నుంచి వస్తున్న కారు ట్యాంక్‌బండ్ పైనున్న ఐస్‌క్రీమ్ పార్లర్ వద్ద కార్తీక్ బైక్‌ను ఢీకొట్టడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే కార్తీక్‌ను సమీపంలోని గాంధీ ఆస్పత్రికి తరలించారు. కార్తీక్ అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారని పోలీసులు తెలిపారు. మృతుడు కార్తీక్ బైక్ వెనకాల ఉన్న మధుకు స్వల్ప గాయాలు కావడంతో గాంధీ ఆస్పత్రి వైద్యులు చికిత్స అందిస్తున్నారు. రోడ్డు ప్రమాదానికి కారణమైన కార్ డ్రైవర్ పరారీలో ఉన్నట్లు తెలిసింది కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు దోమలగూడ పోలీసులు తెలిపారు.